క్లుప్తంగా

పెట్రోల్ బంకులోకి నీరు!



కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లిలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో నీరు వచ్చే ప్రమాదం ఉందని గమనించిన అధికారులు బంకుల్లోని గుంతల్లో ముందుగానే బకెట్లతో నీటిని తోడుతున్నారు. పెట్రోల్ బంకు నిర్మాణం నాణ్యతతో నిర్మించకపోవడంతో డీజిల్, పెట్రోల్ ట్యాంక్ లోకి పోసే ప్రాంతంలో సరైన పనులు చేయకపోవడంతో మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ఊటల వలన పంపు గుంతలోకి నీరు చేరుతున్నాయి. గమనించిన బంకు యజమానులు బకెట్లతో నీటని తోడుతున్నారు. అవి ఎంత తోడిన ఊరుతూ వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

దిగబడిన ట్రాక్టర్



కన్నాయిగూడెం: మండల పరిధిలోని ముప్పనపల్లి గ్రామంలోని బోరుగుడెం వద్ద జీయో కేబుల్ పనులకోసం గత సంవత్సరంలో తవ్విన గుంతలు సరిగా పూడ్చకపోవడంతో ఆ గుంతల్లో గురువారం ట్రాక్టర్ దిగపడింది. గత వారంలో 'సాక్షి'లో ప్రమాదకరంగా మారిన గుంతలు అనే శీర్షికణ ప్రచురితమైన కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించలేదు. ఇప్పటికైన స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బూత్ లెవల్ అధికారులకు ఒక రోజు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంటి నాగరాజు బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో గ్రామాల వారిగా ఓటర్ల జాబితాను పరిశీలించి చనిపోయిన ఓటర్లను, వలస వెళ్లిన వారిని, గుర్తించి వారిని ఎలా తొలగించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. 01-10-23 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి గుంటక నర్సింహారావు, బూత్ లెవల్ అధికారులు ఉన్నారు.

మరమ్మతు చేపట్టాలి



ఏటూరునాగారం: గుంతలు పడిన రోడ్లపై ప్రమాదాలు జరగకుండా వెంటనే మరమ్మతులు చేయించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంజీవ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రలోని ఐటీడీఏ మూలమలుపు వద్ద దెబ్బతిన్న 163 జాతీయ రహదారిని గుంతలను ఆయన పరిశీలించారు. గుంతలు పడ్డ రోడ్లతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు



ఎస్ఎస్ తాడ్వాయి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన తాడ్వాయి-పస్రా మధ్యలోని కొండపర్తి క్రాస్ వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొండపర్తి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి జలగలంచ గొత్తికోయ గూడెంకు చెందిన మడతం రాజు, విజయ్‌లు కిందపడి తీవ్ర గాయాలపాలైయ్యారు. ఈ క్రమంలో తాడ్వాయి పీఏహెచ్‌ఏసీ డాక్టర్ రణధీర్, కాటాపూర్ వైద్యాధికారి డాక్టర్ రంజిత్ విధులు నిర్వర్తించేందుకు ఆస్పత్రులకు వస్తుండగా గాయాల పాలైన వారిని గమనించి క్షతగాత్రులను వారి కారులో తాడ్వాయి పీహెచ్‌ఏసీకి తరలించి వైద్య చికిత్సలు నిర్వహించారు. సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించి, వైద్య చికిత్సలను అందించిన డాక్టర్లు రణధీర్, రంజిత్‌లను పలువురు అధికారులు అభినందించారు.

వ్యాధులపై అవగాహన అవసరం



మంగపేట: పాదుమూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరేష్



వెంకటాపురం: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంగపేట: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ మంగపేట వైద్యాధికారి అల్లి నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని వరద ముంపు ప్రాంతమైన పాదుమూరులో వైద్యాధికారి ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ముంపు ప్రాంత ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కలుషిత నీరు తాగొద్దని, నిల్వ ఉంచిన ఆహారాన్ని తీసుకోవద్దని వేడి ఆహారాన్ని తీసుకుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలని వివరించారు. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, విషజ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జయ, అక్బర్‌అబ్బాస్, రవితేజ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీతారామపురంలో వైద్య శిబిరం

వెంకటపురం(కె): మండలం పరిధిలోని సీతారామపురంలో స్థానిక వైద్య సిబ్బంది గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామంలోని గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాగా, అదే గ్రామంలో అస్వస్థతకు గురై మృతి చెందిన బాధితకుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ సందర్భంగా ఎదిర వైద్యాధికారి రుక్మాకర్ మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి: ఏజెన్సీ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పాటు, గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న కారణంగా గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకపోయిందన్నారు. వర్షాలకు రోడ్లపై నీరు నిల్వడంతో పాటు మురుగు గుంతల్లో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయన్నారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణకు మందు స్ప్రే చేయాలన్నారు. 15 రోజుల నుంచి జీపీ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతుందన్నారు. తాత్కాలిక సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్న ఏ మూలన సరిపోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, సింగిల్ విండో డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, నాయకులు మహేందర్, సాదు చక్రపాణి, నాగరాజు, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 22న గట్టమ్మ దేవాలయం నుంచి గాంధీ పార్కు వరకు నిర్వహించనున్న రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అన్నవరం రవికాంత్, మంకిడి రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యుత్, ఆర్‌అండ్‌బీ, ఎస్పీ, వెటర్నరీ, డీఎంహెచ్‌ఓ, అగ్నిమాపక, వ్యవసాయ, జెడ్పీ, ఎంపీడీఓ కార్యాలయలతో పాటు ఎమ్మార్వో, పోలీస్‌స్టేషన్, శిశు సంక్షేమ, ట్రెజరీ, అటవీ శాఖ, బీసీ సంక్షేమ భవన్, జిల్లా అటవీ శాఖ కార్యాలయాల్లో ఉద్యోగులను కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్రను చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జేఏసీ కన్వీనర్ మడుగూరి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'ముంపు'నుంచి తరలించిన గర్భిణి ప్రసవం



ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ

ఎస్ఎస్ తాడ్వాయి: వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్తగా మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి సాంబలక్ష్మిని బుధవారం జిల్లా కేంద్రానికి తరలించారు. కాగా, గురువారం పండంటి మగబిడ్డ జన్మనిచ్చింది. ఈ మేరకు డీఎంహెచ్ఓ అప్పయ్య జిల్లా కేంద్రలంలోని అస్పత్రిని సందర్శించి తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితి గైనకాలజీస్ట్ డాక్టర్ రఘును అడిగి తెలుసుకున్నారు. డెలవరీ అయిన మహిళకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని అప్పయ్య సిబ్బందికి సూచించారు. జిల్లాలోని మిగతా ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ముంపు ప్రాంతాలలో ఉన్న గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్యాధికారులు, సిబ్బంది ఆదేశించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ముంపు ప్రాంతాల ప్రజలు అధైర్యపడొద్దని, తాము అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన రామన్నగూడెం, ఓడవాడలోని గోదావరి కరకట్ట, పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల ప్రజలు ఎటువంటి సమస్య వచ్చిన తమను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, ఉప సర్పంచ్ కర్ల అరుణ, నాయకులు ఖలీల్ ఖాన్, గుడ్ల వేవేందర్, వావిలాల నర్సింగరావు, వావిలాల చిన్న ఎల్లయ్య, ముక్కెర లాలయ్య, రియాజ్, సులేమాన్,శ్రీనివాస్, గౌస్,సత్యం, సిరాజ్,నవీన్,లక్కి,రమేష్, లక్ష్మయ్య, కిరణ్, తరుణ్, గణేష్, సద్దాం,రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు



బురదమయంగా రాంనగర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం-రాంనగర్ మధ్యలోని బ్రిడ్జి వద్ద నిర్మించిన అప్రోచ్ రోడ్డు వర్షానికి బురదమయంగా మారింది. ఇటీవల రిటైనింగ్ వాల్ కోసం తీసిన మట్టి రోడ్డు వెంట పోయడంతో వచ్చిపోయే వాహనాల రద్దీకి బురదగా మారడంతో వాహనాలు జారిపడుతున్నాయి. పనులు పూర్తి చేసి బీటీ, సీసీ వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఉట్నూరి యాకమ్మ అనే వితంతు మహిళ ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని దాతల సహాయంతో ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సభ్యులు ఆమె ఇంటి వద్దకు వెళ్లి గురువారం రూ.10వేలు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు కూడా బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ టీచర్ అనంత లక్ష్మి మాట్లాడుతూ.. ఇలాంటి పేదలను ప్రభుత్వం గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యరమ్రనేని సతీష్, బండపల్లి సంతోష్, వద్ది నరేష్, ఎంపెల్లి నరేష్, మహమ్మద్ అజాహార్, పడిదల హనుమంత్, కొయ్యల సతీష్, విజయ భాస్కర్, తడక సుమన్, సంఘం గోపి, నాగవత్ కిరణ్, అక్షిత్, బండారి లక్కీ, నారా ప్రశాంత్, ఖయ్యూమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

ములుగు: జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్న ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని వాయిదా వేసినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ బృందం వెళ్లనున్నట్లు తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క గోదావరి పరివాహక ప్రాంతాల్లో, ఆయా మండల కేంద్రాల్లో పరిస్థితులను పరిశీలిస్తారని తెలిపారు.

సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

ములుగు రూరల్: ఎస్సీ వర్గీకరణ జాప్యానికి నిరసనగా చేపడుతున్న మాదిగ విశ్వరూప బహిరంగసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల వీరయ్య అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగలకు జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించాలని గత 29 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. 59 ఉప కులాల సభ్యులు ఆగస్టు రెండో వారంలో చేపడుతున్న 'హలో మాదిగ చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధిక సంఖ్యలో మాదిగలు, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వరదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

వాజేడు: వరదలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల ముఖ్య నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లా అధికారులు వరదలను అంచనా వేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. గత సంవత్సరం వచ్చిన వరదల మూలంగా మండలంలోని ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఇప్పటి వరకు వరద ముంపు పరిహారాన్ని పూర్తి స్థాయిలో ఇవ్వలేదని అన్నారు. ఇప్పటి వరకు మండలాల స్థాయిలో కూడా వరదలపై ఏలాంటి సమావేశాన్ని పెట్టలేని స్థాయిలో ప్రభుత్వం ఉందన్నారు. వరదలు వచ్చిన తరువాత అధికారులు హడావిడి మొదలు పెట్టారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు తుమ్మల వెంకటరెడ్డి, సాంబి రెడ్డి, రఘుపతి, వంక రాములు, వాసు, రత్నం, దేవయ్య, శ్రీను, చిట్టి బాబు, చారి, రమాదేవి ఉన్నారు.

పనులను అడ్డుకున్న పంచాయతీ సిబ్బంది



తాత్కాలిక సిబ్బందిని అడ్డుకుంటున్న కార్మికులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక సిబ్బందిని పంచాయతీ కార్మికులు పనులు చేయకుండా అడ్డుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్పంచ్ చిడెం యామిలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పేరుకు పోయిన చెత్తను తొలగించేందుకు తాత్కలిక సిబ్బందిని ఏర్పాటు చేసి తొలగిస్తున్నారు. కాగా సమ్మెలో ఉన్న పంచాయతీ సిబ్బంది సర్పంచ్ చిడెం యామిలిని, తాత్కాలిక సిబ్బందిని పనులు చేయకుండా కార్మిక సంఘాల నాయకులతో కలిసి పంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు.

ప్రాజెక్టులోకి చేరుతున్న వరదనీరు



మూడు అడుగుల వరకు చేరిన నీరు

మంగపేట: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మల్లూరు వాగు మధ్యతరహ ప్రాజెక్టులోకి రెండు రోజుల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో జూలై 13 నాటికి 20 అడుగుల మేరకు నీరు చేరి జలకల సంతరించుకుంది. ఈ ఏడాది వర్షాలు లేక పోవడంతో నాలుగు రోజుల క్రితం వరకు ప్రాజెక్టులో చుక్కనీరు లేక బోసిపోయి కనిపించింది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని కొప్పుగుట్ట, మునలమ్మ గుట్ట అటవీ ప్రాంతం నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండటంతో జలకల సంతరించకుంది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 07 అడుగుల నీటి మట్టం నెలకొంది. ప్రాజెక్టు నీటి మట్టం, కుడి ఎడమ తూములను ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ వలీమ్ మోహమ్మద్ గురువారం పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం మొత్తం 27 అడుగులు కాగా ప్రస్తుత 07 అడుగులు ఉందని మరో 20 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు మత్తడి పోస్తుదన్నారు. ప్రాజెకుట్లోకి వచ్చే నీటి సామర్థ్యాన్ని బట్టి చూస్తే వారం రోజుల్లో మత్తడి పడే అవకాశం ఉందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంగపేట: మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



వాజేడు: సమ్మె చేస్తున్న సిబ్బంది



ఏటూరునాగారం: బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది



ములుగు రూరల్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

ములుగు రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు గొంది కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో కార్మికులు చేపడుతున్న దీక్షకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మిక వ్యవస్థలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. నాయకులు సురేష్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వాజేడు: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమకు జీఓ 60 ద్వారా జీతాలు ఇవ్వాలని, కారోబార్‌లను సహాయక కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పించాలని, జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు.

మంగపేట: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంబేడ్కర్ సంఘం సీనియర్ నాయకుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న జీపీ కార్మికుల దీక్షలకు అంబేడ్కర్ సంఘం మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బసారికాని హరికృష్ణ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు గురువారం సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజులుగా జీపీ కార్మికులు వారి న్యాయపరమైన హక్కుల కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు రాజారత్నం, యాదగిరి, శ్యాంబాబు, ముత్యాలు, కాంతారావు, వీరస్వామి, ఎల్లయ్య, మల్లేష్, సురేష్, సాంబశివరావు, బాబు, సతీష్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 15వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు స్థానిక బస్టాండ్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట కార్మికులు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ మండల అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగేశ్వరరావు, రాజేశం, శంకర్, కల్యాణ్, సందీప్, సమ్మక్క, జ్యోతి, రమణ, రమేష్, ఎల్లయ్య,గట్టయ్య, వెంకటేశ్వర్లు, ప్రణయ్, సత్యం, చుక్కయ్య, రవి, భూలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో



కాటారం: కాటారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. కళాశాలలో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినులు కళాశాలకు రావడం లేదని పేర్కొన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, తరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.